క్లుప్తంగా

వివాహ వేడుకల్లో ప్రభుత్వ విప్



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన గట్ల ప్రకాశ్ కుమారుడి వివాహ వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఆది భార్య ఆది వనజ, కుమారుడు ఆది కార్తిక్, డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, నాయకులు తదితరులున్నారు.

బద్ధం ఎల్లారెడ్డిపై పీహెచ్‌డీ చేసిన మహిళకు అభినందనలు



అనిత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ బద్ధం ఎల్లారెడ్డిపై పీహెచ్‌డీ పరిశోధన చేసి కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన డాక్టర్ ఈదులకంటి అనితను ఆయన కుటుంబ సభ్యులు అభినందించారు. శుక్రవారం బద్ధం ఎల్లారెడ్డి కొడుకులు, కోడళ్లు డాక్టర్ రామ్‌రెడ్డి, డాక్టర్ సునీత, లక్ష్మారెడ్డి, సవిత, సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులతో బీఎస్పీ నాయకులు

రుద్రంగి: మండల కేంద్రంలో బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ గసికంటి అరుణ్ అధ్యక్షతన శుక్రవారం బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై రుద్రంగి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంచు అనిల్, ఇన్‌చార్జ్‌గా గుడిసె గంగరాజం ఎన్నికయ్యారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ వేడుకలు



ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు చెట్కూరి నారాయణగౌడ్, రాష్ట్ర నాయకుడు మాలోతు సూర్యానాయక్, దరువు మల్లారెడ్డి, లింగాల దాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్య ఉందా.. ఫిర్యాదు చేయండి



ఎల్లారెడ్డిపేట ఠాణాలో ఏర్పాటు చేసిన బోర్డు

ఎల్లారెడ్డిపేట: ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. మండల కేంద్రంలోని ఠాణాలో పోలీసులు ప్రజల సహాయార్థం ఉన్నతాధికారుల ఫోన్ నంబర్లు తెలిపే బోర్డును ఏర్పాటు చేశారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా అధికారులకే చెప్పుకునేందుకు అవకాశం కల్పించారు. ఎస్పీ, డీఎస్పీ, సీఐ స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు తెలిపే బోర్డును ఏర్పాటు చేశారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందే!

- బస్టాండ్‌లో భద్రత కరువు
- ఇరుకుగా ఆర్టీసీ బస్టాండ్
- ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు

వేములవాడఅర్బన్: ఆధ్యాత్మిక క్షేత్రం.. దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి మొదలు వేములవాడ పట్టణంలో ఎటూ వెళ్లినా ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతున్నాయి. బస్టాండ్ కూడలి వద్ద ఆది, సోమవారాల్లో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది.

వెంటాడుతున్న ట్రాఫిక్

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణచౌక్‌లోని చౌరస్తా వద్ద నాలుగుదారులు, వేములవాడ–సిరిసిల్ల–కరీంనగర్ రహదారులు, వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ వెళ్లే మార్గంతో నాలుగు దారులు కలిసిన చోటట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. ఎక్కడి నుండి ఏ వాహనం వస్తుందో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ చౌరస్తాను విస్తరించి ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఇరుకైన ఆర్టీసీ బస్టాండ్

వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ సుమారుగా ఐదెకరాల విస్తీర్ణంలో నిర్మించారు. అప్పటి జనాభా, భక్తుల రద్దీని బట్టి బస్టాండ్ సరిపోయింది. అయితే బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులకు వసతిగదులు లేవు. ఇటీవల ప్రయాణికుల రద్దీ పెరగడంతో బస్టాండ్ ప్రాంగణం సరిపోవడం లేదు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.



ఆగిన మూలవాగు బ్రిడ్జి నిర్మాణం పనులు



తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద వాహనాల రద్దీ

64 బస్సులు..

వేములవాడ ఆర్టీసీ డిపోలో 64 బస్సులు.. రోజుకు 30వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. సుమారు 40 నుంచి 50 వేల మంది ప్రయాణికులను గమ్యానికి చేరవేస్తున్నాయి. రోజుకు ప్రయాణికుల నుంచి సుమారు రూ.8లక్షలు ఆదాయంగా వస్తున్నాయి. ఇంత ఆదాయం ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో భద్రత మాత్రం కరువైందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. బస్టాండ్‌లో ఒక్క సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. అది కూడా పని చేయడం లేదు. రాత్రి పూట సెక్యూరిటీ గార్డు లేక పోకిరీల బెడదతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రభుత్వం ప్రయాణికుల రద్దీని బట్టి ఈ బస్టాండ్‌ను అన్ని హంగులతో మోడల్ బస్టాండ్‌గా ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఆగిన మూలవాగు బ్రిడ్జి

వేములవాడ మూలవాగుపై రెండు బ్రిడ్జీలు, కూడళ్ల సుందరీకరణకు 2015లో కోర్‌నెట్ నిధులు రూ.28 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభించారు. మూలవాగుపై రెండు బ్రిడ్జీలకు గాను ఒక్క బ్రిడ్జి పూర్తయింది. మరొక బ్రిడ్జి ప్రారంభంలోనే వర్షాలకు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయి మూడేళ్లలో మూడుసార్లు కూలింది. కూడళ్ల నిర్మాణం జరగలేదు. 2018లో పూర్తి కావాల్సిన ఈ పనులు ఇప్పటి వరకు కొనసా..గుతూనే ఉన్నాయి. ప్రస్తుతం బ్రిడ్జి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ బ్రిడ్జి పనులు పూర్తి జరిగి, రెండు కూడళ్ల సుందరీకరణ జరిగితే వాహనాలకు ట్రాఫిక్ జామ్ కాకుండా సజావుగా వెళ్లే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

మోడల్ బస్టాండ్ ఏర్పాటు చేయాలి



వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలోనే ప్రయాణికులకు అనుకూలంగా అన్ని హంగులతో మోడల్ బస్టాండ్ ఏర్పాటు చేయాలి. రాజన్న ఆలయం ఉన్నందున నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారు. బస్టాండ్‌లో వేచి ఉండేందుకు అనుకూలంగా బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్, తిప్పాపూర్

బ్రిడ్జిని పూర్తి చేయాలి



తిప్పాపూర్‌లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా అవుతుంది. మూలవాగు బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలి. కూడళ్ల పనులు కూడా పూర్తి చేస్తే ట్రాఫిక్ జామ్ ఏర్పడదు. బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది.

– వేల్పుల రాజు, నాంపల్లి

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



ఎల్లారెడ్డిపేటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



వీర్నపల్లి: చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ఎల్లారెడ్డిపేట: యేసుక్రీస్తు ప్రేమ స్వరూపి అని, సర్వపాపాల విముక్తి కోసం ఆయన శిలువలో మరణించి తిరిగి పునరుద్ధానుడయ్యాడని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ రాజేశ్ అన్నారు. అల్మాస్‌పూర్, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట, దుమాల, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎల్లారెడ్డిపేటలో యేసుక్రీస్తు శిలువ సన్నివేశాలను ప్రదర్శిస్తూ క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు కులేరి కిషోర్‌కుమార్, అబ్రహం, దీప్తి, మధు, రత్నాకర్, ప్రేమ్‌కుమార్, క్రీస్తుదాసు, నతాన్యల్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల చర్చిల్లో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. గ్లోరియస్ గాస్పెల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేశారు. క్రీస్తు త్యాగాలను పాస్టర్ యేసుదాస్ వివరించారు. పాస్టర్లు, చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్ చర్చిలో..

ముస్తాబాద్: మోహినికుంట, ముస్తాబాద్, గూడెం, కొండాపూర్ గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్లు గిద్యోను, సామ్యూయేల్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా స్వామివారి చక్రస్నానం



పుష్కరిణిలో స్వామివారి చక్రస్నానం

ముస్తాబాద్: గూడెంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు స్వామివారి చక్రస్నానంతో శుక్రవారం ముగిశాయి. ఐదు రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం పుష్కరిణిలో స్వామివారి ఉత్సవ మూర్తులకు చక్రస్నానం నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో స్వామివారి చక్రస్నానంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌చారి, శ్రీకాంతచారి, మాజీ సర్పంచ్ చిట్నేని సరిత, ఎంపీటీసీ శ్రీధర్, నాయకులు అంజన్‌రావు, కొమ్ము బాలయ్య, శ్రీనివాస్‌రావు, శాడ శ్రీనివాస్, బట్టు తిరుపతి, రాజయ్య, బాలమల్లు, మల్లేశం, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు



ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

చందుర్తి(వేములవాడ): రాత్రిపూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను చందుర్తి పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆశిరెడ్డిపల్లె శివారులోని కొత్త చెరువు శివారు ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న సమాచారం మేరకు కానిస్టేబుల్ వెళ్లగా.. జేసీబీతోపాటు 6 ట్రాక్టర్లతో ఇసుక స్మగర్లు పరారయ్యారు. మిగిలిన 4 ట్రాక్టర్లను పోలీసులు అడ్డగించి పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లను వదిలేయాలని అధికార పార్టీకి చెందిన నాయకుడు పోలీసులపై ఒత్తిడి తెచ్చినా వారు వినిపించుకోలేదు. అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లోనే ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్, రామన్నపేట గ్రామాలకు చెందిన గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. నాలుగు ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మిగతా ట్రాక్టర్ల వివరాలను సేకరించి స్వాధీనం చేసుకుంటామన్నారు.

'ఒకటో తేదీనే పింఛన్లు ఇవ్వాలి'



సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లు ప్రతి నెల ఒకటో తేదీనే అందించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జువ్వాజి విమల డిమాండ్ చేశారు. స్థానిక బీవైనగర్‌లోని సీఐటీయూ ఆఫీసులో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.4వేల జీవనభృతి అమలు చేయాలని కోరారు. మహిళా సంఘాలకు రావాల్సిన వడ్డీ ఇవ్వడంలో ఎందుకు జాప్యమవుతుందని ప్రశ్నించారు. వడ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న గడ్డం నర్సయ్య



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: రైతు సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే కేటీఆర్ తంగళ్లపల్లి మండలంలో రైతులను కలిసి వారిపై కపట ప్రేమను ఒలకబోస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుతో తెలంగాణకు సాగునీరు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టగా.. బీఆర్‌ఎస్ సర్కారు రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టేందుకే అసంబద్ధమైన కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్, వెల్మల తిరుపతిరెడ్డి, నీలి రవీందర్, గుజ్జె రవీందర్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్ విమర్శలు అర్థరహితం

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ కాంగ్రెస్ పార్టీపై చేసిన విమర్శలు అర్థరహితమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. 10 సంవత్సరాలుగా మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులు శూన్యమన్నారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, నాయకులు చెన్ని బాబు, గంట బుచ్చాగౌడ్, బండారి బాల్‌రెడ్డి, గుండాడి రాంరెడ్డి, నరేందర్, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ మొసలి కన్నీరు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఎన్నడూ లేని విధంగా రైతులపై ప్రేమ నటిస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నాడని కాంగ్రెస్ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. తంగళ్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు పూర్మాని లింగారెడ్డి, గుగ్గిళ్ల నర్సింగంగౌడ్, లింగాల భూపతి, గడ్డం మధుకర్, అరెపల్లి బాలు, మిరాల శ్రీనివాస్‌యాదవ్, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది ప్రజావ్యతిరేక పాలన



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: దేశంలో బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. శుక్రవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. శనివారం హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సదస్సుకు కార్యకర్తలు పెద్దఎత్తున హాజరవుతారన్నారు. నాయకులు పంతం రవి, కడారి రాములు, మీస లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్‌యాదవ్

తంగళ్లపల్లి: కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఇల్లంతకుంట బీఆర్‌ఎస్ కార్యాలయంలో యూత్ నాయకులతో సమవేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎంపీగా రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ తీసుకొచ్చిన ఘనత వినోద్‌కుమార్‌కు ఉందన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు జక్కుల నాగరాజు, ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎండీ షాదుల్, చందన్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, బాలకిషన్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీధర్, వెంకటేశం, రఘు, భాస్కర్, నరేష్, నాగరాజు, తిరుపతి, అంజయ్య, మధు, కార్తీక్, శ్రీకాంత్, రమేశ్, సతీష్, బాబు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి



మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్



మర్లపేటలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ముస్తాబాద్: సాధారణ ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు ప్రవర్తన నియమావళిని పాటించి ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. ముస్తాబాద్ మాతృశ్రీ గార్డెన్స్‌లో అఖిల పక్షం సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి రాజకీయ నాయకుడు, కార్యకర్త నిబంధనల మేరకు ప్రచారం నిర్వహించాలని కోరారు. మద్యం, డబ్బు, బహుమతుల పంపిణీ వంటి వాటి జోలికి వెళ్లొద్దని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా బాధ్యతగా ఉండాలన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొంపెలి సురేందర్‌రావు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, గజ్జెల రాజు, కొండల్‌రెడ్డి, రమేశ్, తలారి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: ప్రజలు తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఏఎస్సై మోతీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతం, మర్లపేట గ్రామంలో ఎన్నికల నిబంధనలపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య, పోలీసులు తదితరులున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఎల్లారెడ్డిపేట: ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పాటించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్సై కిషన్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, శంకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు, నాయకులు షేక్ గౌస్, పందిళ్ల లింగంగౌడ్, గుండాడి రాంరెడ్డి, బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్, బీపేట రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వరస కృష్ణహరి, అజ్మీరా తిరుపతినాయక్, ఎనుగందుల నర్సింలు, మురళీమోహన్ గౌడ్, బీజేపీ నాయకులు సంజీవరెడ్డి, సందుపట్ల లక్ష్మారెడ్డి, మిరియాల్ రవి పాల్గొన్నారు.

రుద్రంగి: ఎన్నికల నిబంధనలను అతిక్రమించి సరైన ధ్రువపత్రాలు లేకుండా ఎక్కువ మొత్తంలో డబ్బులు తరలిస్తే డబ్బులను సీజ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం రుద్రంగి పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్, చెక్‌పోస్టు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వీర్నపల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్టీలు సహకరించాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. అన్ని పార్టీల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అధికారుల నిబంధనలు

కోనరావుపేట: సమాచార హక్కు చట్టంపై అధికారులు తమకు ఇష్టం వచ్చిన నిబంధనలు పెడుతున్నారని కొండాపూర్ గ్రామానికి చెందిన నేవూరి రత్నాకర్ ఆరోపించారు. కొండాపూర్ గ్రామ పంచాయతీలో రికార్డుల తనిఖీకి నేవూరి రత్నాకర్ దరఖాస్తు తీసుకున్నారు. ఇందుకోసం ఏప్రిల్ 1, 2, 3 తేదీల్లో గ్రామ పంచాయతీకి వచ్చి రికార్డులు తనిఖీ చేసుకునేందుకు అనుమతి ఇస్తూ లేఖను పంపించారు. అయితే తనిఖీ సమయంలో ఎలాంటి ఫొటోలు, వీడియోలు తీయరాదన్న నిబంధన పెట్టారు. దీనిపై రత్నాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగంపై కళా ప్రదర్శనలు



దుండ్రపల్లిలో తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ప్రదర్శన

సిరిసిల్ల: ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని కోరుతూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు శుక్రవారం కళా ప్రదర్శనలిచ్చారు. సిరిసిల్ల పట్టణంలో, బోయినపల్లి మండలం దుండ్రపల్లిలో కళాకారులు పాటలు పాడారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందరూ పోలింగ్‌లో పాల్గొనాలనే సందేశాన్నిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రదర్శనలిచ్చినట్లు డీపీఆర్వో వంగరి శ్రీధర్ తెలిపారు. కళాకారులు శ్రీధర్‌రెడ్డి, రాములు, పొత్తూరి రాజు, గడ్డం దేవయ్య, పూదూరి సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, కిన్నెర, శ్రీలత, అనుముల శిరీష తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న చేపూరి బ్రదర్స్

బోయినపల్లి: తడగొండ గ్రామ బస్టాండ్ ప్రాంతంలో చేపూరి లచ్చమ్మ స్మారకార్థం ఆమె కుటుంబీకులు చేపూరి మల్లయ్య ఆధ్వర్యంలో చేపూరి బ్రదర్స్ శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.